క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సి.బెళగల్:మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని కొత్తూరు పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటు నమోదును తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 1-1-2025 నాటికి 18సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.అలాగే ఓటరు జాబితాలో ఏవైనా పేర్లు, అడ్రసు మార్పులు, చేర్పులున్నా, మృతి చెందిన వ్యక్తుల పేర్లను తొలగించాల్సినా బీఎల్వోలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెసరవాయి ఉప సర్పంచ్ రాజీనామా

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామం ఉప సర్పంచ్ గ్రంధివేముల సాయి సుధ శనివారం రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ వాసుదేవ గుప్తాకు అందజేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాజీనామాను ఆమోదిస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మహీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

పాణ్యం: పాణ్యం మండల పీఆర్‌టీయూ నూతన కమిటీని శనివారం సభ్యులు ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ నాయకులు రామపక్కీర రెడ్డి, సిమోన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా జి. మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిసార్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్వరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం, మహిళా కార్యదర్శిగా సుజాత, కార్యదర్శులు సుదర్శన్, రాముతో పాటు సభ్యులను ఎన్నుకున్నామని రామపక్కీరరెడ్డి, సిమోన్ చెప్పారు.

అలసత్వం వహిస్తే చర్యలు



చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంజుల వాణి

కల్లూరు: చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ మంజుల వాణి హెచ్చరించారు. శనివారం పెద్దకొటాల గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు.

ఓటు నమోదు చేసుకోండి



బిలకలగూడూరు పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

గడివేముల: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం కూడా ఆయా పోలింగ్ బూతుల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటు నమోదుకు 13, ఓటరు కార్డులో తప్పులను సవరించుకునేందుకు 21 దరఖాస్తులు వచ్చాయన్నారు. తహసీల్దార్ వెంట ఎలక్షన్ ఆపరేటర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ.. భవితకు నిచ్చెన

- విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తున్న వైనం
- ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న యువత
- సికింద్రాబాద్, ఢిల్లీ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న కేడెట్లు
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం



సికింద్రాబాద్‌లోని ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో పాల్గొన్న కర్నూలు సిల్వర్ జూబ్లీ కేడెట్లు

కర్నూలు కల్చరల్: విద్యార్థి దశ నుంచే దేశ భక్తి.. ఐక్యతా భావం.. నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌సీసీ పాత్ర కీలకం. విద్యా సంస్థల్లో ఎంపిక చేయబడిన కేడెట్లకు సైనిక శిక్షణ ఇవ్వడంతోపాటు సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడిపించేలా తర్ఫీదు ఇస్తున్నారు. జిల్లాలోని పలువురు నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) సికింద్రాబాద్, ఢిల్లీ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఏటా ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నవంబర్ నాల్గవ ఆదివారం ఎన్‌సీసీ డే

1948 జులై 15న నేషనల్ కేడెట్ కార్ప్స్ ఆవిర్భవించింది. అదే సంవత్సరం నవంబర్ ఢిల్లీలో మొదటి ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. దీంతో అప్పటి నుంచి ఏటా నవంబర్ నాల్గవ ఆదివారం ఎన్‌సీసీ డే నిర్వహిస్తున్నారు. ఎన్‌సీసీ దేశంలోనే అతి పెద్ద యువజన సంస్థ. భారత దేశ సైన్యంతో అనుబంధంగా ఉంటుంది. విద్యార్థులు, యువతలో ఆత్మ స్థైర్యం నింపడంతోపాటు జాతీయ భావాన్ని పెంపొందించడం, క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు అందుకునేలా ప్రోత్సహిస్తున్నారు. సమాజ సేవ జాతీయ సమైక్యతా భావం కలిగిస్తుంది. విపత్తు సమయాల్లో ప్రజలకు సేవలు అందించేలా ఎన్‌సీసీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.



డ్రిల్ ప్రాక్టీస్ చేస్తున్న కేడెట్లు

ఉన్నత చదువుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు ఉన్నత చదువుల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ఎ- సర్టిఫికెట్, ఇంటర్ స్థాయిలో బి- సర్టిఫికెట్, డిగ్రీలో సి-సర్టిఫికెట్లు అందిస్తారు. సి- సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు వస్తాయి. ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. మెడికల్, ఇంజినీరింగ్, ఉన్నత చదువుల్లోనూ ఒక శాతం రిజర్వేషన్ ఉంటుంది.

9 (ఎ) గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్

ఈ బెటాలియన్‌లో 40 విద్యా సంస్థలు ఉన్నాయి. 8 సీనియర్ వింగ్స్‌లో 800 మంది, 32 జూనియర్ వింగ్స్‌లో 950 మంది కలిపి మొత్తం 1,750 మంది బాలికల ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నారు.



➤ఈ చిత్రంలో ఉన్న యువతి పేరు రేష్మా. ఈమె 9 (ఎ) బాలికల పటాలం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఎన్‌సీసీ విద్యార్థిని అయిన రేష్మా గత సెప్టెంబర్ నెలలో జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఈబీఎస్‌బీ(ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్) క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ ప్రశంసా పత్రం, పతకానికి ఎంపికైంది. రాష్ట్ర తరఫున ఈ పత్రాలను సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా అందుకోనుంది.



➤ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు కె.సరోజమ్మ. ఈమె 9 (ఎ) బాలికల పటాలంలో సీనియర్ అసిస్టెంట్. బాలికల పటాలంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈమె డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ ప్రశంసా పత్రం, పతకానికి ఎంపికయ్యారు.

యువతలో దేశ రక్షణభావం కలుగుతోంది



యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్‌లతో కూడిన ట్రై-సర్వీసెస్ ఆర్గనైజేషన్‌గా స్వచ్ఛందంగా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఫైరింగ్, డ్రిల్, నైట్‌మార్చ్, మ్యాప్‌రీడింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆర్‌డీసీ, టీఎస్సీ క్యాంపులకు పంపుతున్నాం. ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని ఆదివారం రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛంద రక్తదానం నిర్వహిస్తున్నాం.

– కల్నల్ జోబీ ఫిలిప్, కమాండింగ్ అధికారి
9 (ఎ) ఎన్‌సీసీ బాలికల పటాలం

నేడు రాజపుత్ బొందిలి వన భోజనాలు

కర్నూలు(అర్బన్): ఈనెల 24న జిల్లా రాజపుత్ బొందిలి కుల బాంధవుల యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం నేతలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న యునైటెడ్ క్లబ్ ఆవరణలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లాలోని రాజపుత్ బొందిలి సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

న్యూమోనియాతో జాగ్రత్త



తల్లులకు అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): శీతాకాలంలో న్యూమోనియా బారిన పడకుండా చిన్నపిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని డెమో శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ఇందిరమ్మ హౌసెస్ పరిధిలోని 93 సచివాలయంలో న్యూమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు 'ప్రతి శ్వాస ముఖ్యమైనది-న్యూమోనియాను నివారిద్దాం' నినాదంతో తల్లులకు న్యూమోనియాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు దగ్గు, జలుబు, వేగంగా శ్వాస తీసుకోవడం, డొక్కలు ఎగరవేయడం, జ్వరం వంటి లక్షణాలుఉన్నప్పుడు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించాలన్నారు. గర్భిణులకు, ఐదేళ్లలోపు క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలని, దీనివల్ల తల్లులను, పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- డీఎస్పీ బాబు ప్రసాద్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

ఓర్వకల్లు: పెండింగ్ కేసులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆదేశించారు. శనివారం డీఎస్పీ బాబు ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులను సిద్ధంగా వుంచుకోవాలని సూచించారు. అట్రాసిటీ కేసుల వివరాలపై ఎస్‌ఐ సునీల్‌కుమార్‌ను ఆరాతీశారు. పోలీసు సిబ్బంది పనితీరును మెరుగుపడేలా చూసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాహనదారులపై తరచుగా తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించాలని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్‌ఐ సునీల్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఓ నూకరాజు

కోడుమూరు రూరల్ : ప్రతి ఇంటిలో 18సంవత్సరాలు దాటిన వారికి నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా చేయాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శనివారం కోడుమూరులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను డీఎంఓ తనిఖీ చేశారు. స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించిన ఆయన సేవలపై ప్రజలతో మాట్లాడారు. అనంతరం డీఎంఓ మాట్లాడుతూ దోమలు, కలుషిత నీటి మూలంగా వ్యాపించే డెంగీ, ఫైలేరియా, మెదడువాపు, డయేరియా, అతిసారా తదతర వ్యాధుల తీరును ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కోడుమూరు కోట్‌లోకేటెడ్ పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్‌మాదన్న, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు ఎంపీపీ సునీత

కోడుమూరు రూరల్ : ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీపీ సునీత సూచించారు. గూడూరు వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ సునీత అధ్యక్షతన ఎంపీడీఓ శివనాగప్రసాద్ జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభలో లేవనెత్తారు. తమ గ్రామంలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జూలకల్ సర్పంచ్ విద్యావతి సభ దృష్టికి తీసుకొచ్చారు. మునగాల సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ గత సెప్టెంబరులో కురిసిన వర్షాలతో పంటలు భారీగా దెబ్బతిన్నాయని, ఇంతవరకు రైతులకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. స్పందించిన ఏఈఓ లక్ష్మీనారాయణ నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. ఎంపీడీఓతోపాటు తహసీల్దార్ రామాంజినేయులు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఎలక్ట్రికల్ ఏఈలు సన, నాగరాజు, శ్రీనివాసనాయక్, ఏపీఎం అయ్యమ్మ తమ తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి విన్పించారు.


ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, బీసన్న, షాబీర్‌బాసా,చంటి,గోపీ,కుమార్, అస్లాం, కృష్ణ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి



పున్నమి రెస్టారెంట్ పరిసరాలను పరిశీలిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. శనివారం ఆయన వీఆర్ కాలనీలోని పున్నమి రెస్టారెంట్, ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పున్నమి రెస్టారెంట్ ఆవరణలో ఉన్న డంప్ యార్డ్‌ను వీలైనంత త్వరగా తొలగించాలని ఆదేశించారు. గదుల పునరుద్ధరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గార్గేపురం చెరువు వద్ద బోటింగ్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. చైర్మన్ వెంట బోర్డ్ డైరెక్టర్ ముంతాజ్‌బేగం, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఏపీటీడీసీ డీఎంచంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్‌ఈ ఈశ్వరయ్య ,అకౌంట్స్ మేనేజర్ రామకృష్ణ, పున్నమి రెస్టారెంట్, ఓర్వకల్లు రాక్‌గార్డెన్ మేనేజర్లుసతీష్,జీవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని, మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ రాణెమ్మ, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో అభివృద్ధి పనులపై డీడీ సమావేశం నిర్వహించారు. విద్య, పశుసంవర్ధక, ఐసీడీఎస్, అగ్రికల్చర్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ, హౌసింగ్ తదితర శాఖలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యదర్శుల పనితీరు అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెలను సందర్శించాలని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు విధులపై పర్యవేక్షణ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఎంఈఓ- 2 ఆదామ్‌బాషా, సి.బెళగల్ పశు వైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత, ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విద్యా వనరులు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీడీ శ్యామల సూచించారు. పాఠశాలలను శనివారం డీడీ తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను, వంట సరుకులు, పుస్తకాల గదులను పరిశీలించారు. వంట సరుకుల గది, పుస్తకాలు నిల్వ గదులు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన మరుగుదొడ్లు వినియోగంలో లేవని విద్యార్థులు డీడీకి విద్యార్థులు ఫిర్యాదు చేయగా వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం అజీమ్‌బాషాను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం – 6 తనిఖీ చేశారు. సీసీ రోడ్లు, చెత్త సేకరణ కేంద్రాలను డీడీ తనిఖీ చేశారు. సి.బెళగల్ బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీడీ వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్ రాముడు, సిబ్బందికి సూచించారు.



సి.బెళగల్ జెడ్పీ స్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్యామల

నేడు జబర్దస్త్ హాస్య వల్లరి

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జబర్దస్త్ కళాకారులచే హాస్య ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాకారులు అప్పారావు, వినోదిని, గుండు మురళీధర్, నవీన్, ఎస్‌ఆర్‌ఎస్ ప్రసాద్ పాల్గొంటారన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్టాంటన్‌పురంలో రూ.1.10 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుకు సూచించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, మున్సిపల్ ఎస్‌ఈ రాజశేఖర్, కార్పొరేటర్ సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ, డీఈఈ గిరిరాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

కర్నూలు (టౌన్): కల్లూరు ఏరియాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. శనివారం కమిషనర్ కల్లూరు ఎస్టేట్‌లో పర్యటించి కాలనీ అసోసియేషన్ నాయకులతో మాట్లాడారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ క్రిష్ణలత, ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, భాను ప్రతాప్ పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గుడుంబాయి తండాలో పర్యటిస్తున్న లీలా వెంకట శేషాద్రి

ఓర్వకల్లు: గిరిజన ప్రాంతాలలో జీవిస్తున్న ప్రజలు గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సూచించారు. మండలంలోని గుడుంబాయి తండాలోలో శనివానం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించిన ఆయన గిరిజనులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను వివరించారు. గిరిజనులకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మహిళా చట్టాలు, అట్రాసిటీ చట్టం, లీగల్ సర్వీసెస్ యాక్టు 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు మీరందరు అర్హులని పేర్కొన్నారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ఎన్నికల ముందు భవననిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు, శరీన్‌నగర్ మట్టిపని అడ్డాలలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో, బోర్డును పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మునిస్వామి, చాంద్‌బీ, ఈశ్వరమ్మ, అయ్యమ్మ, రామాంజనమ్మ, రమాదేవి, మరియమ్మ, శ్రీనివాసులు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

అదానీపై జేపీసీతో విచారణ జరిపించాలి

కర్నూలు(సెంట్రల్): దేశ ప్రతిష్టతకు భంగం కలిగించిన కార్పొరేట్ కుబేరుడు అదానీపై పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీతో విచారణ చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ అదానీ సంస్థలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శాంతిరామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాణ్యం: శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శాంతిరాముడు మాట్లాడుతూ కరోనా వచ్చిన సమయంలో ఫార్మసిస్టులు అందరూ వ్యాధి నుంచి ప్రజలను కాపాడుకోవడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఫార్మసిస్టులు కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూధనశెట్టి, ఎస్‌బీఐ మేనేజర్ విశ్వనాథం, కెనరా బ్యాంక్ మేనేజర్ బాలచంద్రుడు, కోటేశ్వరరెడ్డి, దివ్య, కిరణ్‌కుమార్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.